
# సానుభూతి

## యం. సూర్యప్రసాదరావు



''ఎన్ని కార్డులు వేయిద్దామన్నయ్యా?''
తమ్ముడి ప్రశ్న నా పరధ్యానాన్ని పోగొట్టలేదు.
నా చూపులు యింకా శూన్యంలోకే చూస్తున్నాయి.
''ఎన్ని కార్డులు వేస్తే... బావుంటుందన్నయ్యా? ఇక్కడ పంచడానికైతే రెండు వందల యితే సరిపోతాయి. మరి నీ కాలేజీవాళ్ళకు యివ్వడాన్కి... ఎన్ని కావాలంటే... అవి కూడా కలిపి ఆర్డర్ చేద్దాం!'' తమ్ముడు మరోమారు అన్నాడు.

అప్పటికి నాన్న స్వర్గస్థుడయి మూడవరోజు. ఆయన దశ దిన కార్యక్రమాల గురించి అయినవారికి తెలియజేయాలన్నా... ఆ సమాచారాన్ని కార్డులుగా ప్రింట్ చేయించి పంచి పెట్టాలన్నా... ఆ రోజే మొదలు పెట్టాలి.

నా చూపులన్నీ ఆయన ఖాళీ చేసి వెళ్ళిపోయిన చోటు మీదే ఉన్నాయి. వరండాలో వాయువ్యంలో ఆయన పడుకున్న మంచం, పరుపూ... దానిమీద కదులుతూ ఆయన రూపం యింకా నా కళ్ళ ముందు కదులుతూనే వుంది.

నా మనసు వాడు చెప్పే మాటల మీద లేదని... వాడు నా భుజం మీద చేయి వేశాడు.

''అన్నయ్యా! ఈ రోజు మూడోరోజు! ఇవ్వాళ కార్డులు ప్రింటింగ్‌కు యిస్తే తప్ప అవి సమయానికి అందవు. కావలసిన వారికి చేరవు. అయిన వాళ్ళందరూ అందుకోరు...''

అప్పటికి నాన్న ఉన్న ప్రదేశం నుండి వాడివైపు దృష్టి మరల్చగలిగాను. కానీ ఏమీ మాట్లాడలేకపోయాను.

వాడినే చూస్తూ ఉండిపోయాను.

వాడికంటే... నా దగ్గరే నాన్నకు చేరిక ఎక్కువ. ఊరుకాని ఊరిలో ఉద్యోగం చేసుకుంటున్నా... నెలకో సారో... రెండు నెలలకో సారో... ఆయన్ను చూడాలనే తపనతోనే రెండున్నర... మూడు గంటల ప్రయాణంలో జన్మభూమిని చేరుకునే వీలుగా ఉన్న కాలేజీ ఉద్యోగాన్ని వదలిపెట్టలేకపోయా. మరెన్నో మంచి ఉద్యోగాలు వచ్చినా... చక్కని ఆఫర్‌లు ప్రలోభ పెట్టినా... తల్లిదండ్రులకు దగ్గరగా ఉండాలనే కోరిక ఆ ఊళ్ళో స్థిరనివాసం కల్పించింది. ఆ ప్రాంతం వాడిని చేసేసింది.

ఆయన మంచం దిగడానికి యిష్టపడని రోజు నుండి... కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరో మనిషిపైన ఆధారపడిన దగ్గర నుండి పదిహేను రోజులకో సారో..... యిరవై రోజులకోసారో... రావడం అలవాటు చేసుకున్నా!

''ఏమండీ... పెద్దోడు వచ్చాడండీ...'' అని ఏ రాత్రప్పుడు వెళ్ళినా అమ్మ పిలిస్తే సరి... ఆయన సంతోషంగా లేచి కూర్చునేవాడు.

''ఎప్పుడొచ్చావురా? అమ్మాయి... పిల్లలు ఎలా వున్నారురా...'' అని ఆప్యాయంగా పలకరించేవాడు.

కనీసం అరగంటకు తక్కువ కాకుండా కుశల ప్రశ్నలు, క్షేమ సమాచారాలు విచారించేవాడు.

''చూడవే! ఇప్పటిదాకా ముఖం మాడ్చుకున్న ముసలాయన... కొడుకు వచ్చేటప్పటికి ఎలా లేచి కూర్చున్నాడో...'' అమ్మ అంటుంటే... ముసి ముసి నవ్వులు రువ్వేవాడు.

''ఎంతయినా కొడుకు... కొడుకే! నాలాంటి కూతురు... కూతురే...''

ఇంటిని అంటిపెట్టుకొని యిద్దరు పిల్లలతో అమ్మా నాన్నని ఆదరంగా చూచుకునే 'విధవ చెల్లెలు' ఆయనను ఉడికించాలని అంటూనే ఉంటుంది.

నేను తెచ్చిన పండో... బిస్కట్లో... స్వీట్లో ఆయనకిస్తే అంత రాత్రి పూట కూడా ఆబగా తినేవాడు. మరునాటికి దాచి ఉంచమని చెప్పేవాడు.

ఇంకా మాట్లాడుతూ కూర్చుంటే...

''బాగా పొద్దు పోయిందిరా! యిహ పడుకో! ఉదయాన్నే మాట్లాడుకుందాంలే!'' లైట్లు మరీ ఆర్పించేవాడు.

''నామీదకన్నా... నీమీదే నాన్నకు ప్రేమలే... అన్నయ్యా! అందుకే ఆయనను అంత తేలికగా మరచిపోలేకపోతున్నావు!''

ఈసారి వాడి మాటలు నాకు శ్రద్ధగా వినిపించాయి.

అది అభినందనో... అభిశంసనో... పొగడ్తో... తెగడ్తో... పట్టించుకునే స్థితిలో ఉంటేగా!

''అవునురా! కళ్ళ ముందు ఆయనే కదలాడుతున్నట్లుగా ఉంది. ఇంకా ఆయన మాటలు వినబడుతున్నట్లే ఉందిరా!''

నా గద్గదమైన కంఠ స్వరం విని కొద్దిసేపు ఆగి అన్నాడు.

''ఇలా... కాలయాపన చేస్తుంటే... కాలం ఆగదు కదా! పోయిన ఆయన తిరిగి రాడు. ఆయనకు జరగాల్సిన కర్మ.... కాండలు వగైరాలన్నీ సక్రమంగా జరగాలంటే... అందరికీ తెలియపరచాలి. అందుకోసం కార్డులు వేయాలి. ఎన్ని కావాలనుకుంటే... అన్ని కార్డులు ప్రింట్ చేయవచ్చు...''

కార్డుమీద ప్రింట్ చేయాల్సిన మేటర్ నా ముందుంచాడు.

సజీవంగా ఆయనను కెమేరాలో బంధించిన ఫొటోలు ముందు పరిచాడు.

''వీటిలో యిది బావుందన్నయ్యా! కార్డుపై దీనిని ప్రింట్ చేయిస్తే ఎలా వుంటుంది?''


చిరునవ్వులు చిందిస్తున్న ఆ ముఖంలో జీవకళ ఉట్టి పడుతోంది. ముఖాన యింత విభూది.... విశాలమైన ఫాలభాగంపై రెండు కనుబొమల మధ్య కుంకుమ చుట్టూ... వెండి తీగల్లాంటి జుట్టుతో ఆయనే సాక్షాత్కరించినట్లయింది.

''ఇది బావుందిరా! దీనినే ఫైనల్ చేద్దాం...'' ఆ ఫొటో ఒకే చేసేశాను.

''ఇంతకూ నీకెన్ని కార్డులు కావాలో చెప్పనే చెప్పలేదు. ఓ యాభై సరిపోతాయా... వంద కార్డులు కావాలా...''

యీ సారి సంఖ్య వాడే చెప్పాడు.

''వంద కార్డులు కూడా చాలవురా! మా కాలేజీ



లోటీచింగ్ స్టాఫే యాభై మందికి పైగాఉన్నారు. అంతకంటే ఎక్కువమంది నాన్ టీచింగ్ స్టాఫ్... యింకా ఊళ్ళో బాగా పరిచయమున్నవాళ్ళు... నాకు కావలిసినవాళ్ళు...''

నేను పనిచేస్తున్న కాలేజీ వాళ్ళను జ్ఞాపకం చేసుకున్నా.

''వంద కార్డులు కూడా ఎక్కువ అవుతాయేమో అన్నయ్యా! శుభకార్యానికి అయితే... ఎక్కువమంది వస్తారు గానీ... అశుభకార్యానికి అంతమందీ రారు...'' తమ్ముడు సలహా చెప్పాడు.

''లేదురా! కనీసం ఏభై మందయినా వస్తారు! అందుకు వంద కార్డు లయినా పంచి పెట్టి రావాలి!'' నిశ్చయంగా అన్నాను.

''అంతమంది తప్పకుండా వస్తారంటావా!'' వాడు రెట్టించాడు.

''తప్పకుండా వస్తార్రా! వంద కార్డులయితే కావాలి! ఏదో ఓ రోజు వీలు చూసుకుని వెళ్ళి పంచి వస్తాను... సరేనా!''

''అంతమంది రారేమో... అన్నయ్యా?'' సందేహంగా అన్నాడు.

''తప్పకుండా వస్తారురా! నాకానమ్మకం వుంది. ముప్ఫై రెండే ళ్ళుగా ఆ కాలేజీలో పనిచేస్తున్న వాడిని. ఎవరికి కష్టం వచ్చినా... అక్కడ కనిపించే వాడిని... నాకోసం... నా ఓదార్పు కోసం వాళ్ళు రాకుండా ఉంటారా...''

''రావాలనే అనుకోవచ్చుగానీ... మీ ఊళ్లో వస్తారేమో... యిక్కడకు... యింత దూరం... రైలు ఛార్జీలు పెట్టుకొని వస్తారంటావా...''

''వస్తారురా! యిక్కడ నేను బ్రహ్మంగారి అబ్బాయిని. అక్కడ... ఫలానా లెక్చరర్ తండ్రి బ్రహ్మంగారు! ఆయన స్వర్గస్థులైనారని తెలిసి రాకుండా ఉంటారంటావా...''

ఆ క్షణంలో కూడా నాలో తొంగి చూచిన అహం చూచి వాడు మారు మాట్లాడలేదు.

''రావాలిరా? తప్పకుండా రావాలి! ఎన్ని శుభ కార్యాలకు నేను సహాయం చేశానో! ఎంతమంది ఇళ్ళల్లో ఎన్ని అశుభకార్యాలకు చేదోడు వాదోడుగా ఉన్నానో...'' నేను గత జ్ఞాపకాలలోకి వెళ్ళి పోతుండడం గమనించి వాడు లేచాడు.

''ప్రెస్‌కు నేనే వెళ్ళి వస్తాలే! ప్రూఫ్ చేయించి పట్టుకు వస్తా... నువ్వు చూద్దువుగానీ!''

ఏదో పనిమీద ఓ లెక్చరర్ యింటికి సాయంత్రం నాలుగు గంటలప్పుడు వెళ్ళాను. ముందు వరండాలో చాపమీద పడుకోబెట్టబడిన ముసలాయన... తల దగ్గర... ఆమె కూర్చుని కనిపించారు.

''ఏమయిందమ్మా''

''ఇప్పుడే మావగారు పోయారు అన్నయ్యగారూ! మీ బావగారు బజారుకు వెళ్ళారు. కొంచెం కబురు చెప్తారా!'' ఆమె ఆవేదనగా అంది.

ఊరుగాని ఊరు... ఉద్యోగానికి వచ్చినవాళ్ళం! మాకు బంధువు లెవరుంటారు?

మేమే... బావా... బావమరుదుళ్ళం!

ఉన్న టి.వి.యస్ మీదే... గబ గబా అందరినీ



సమీకరించా. దగ్గరలో ఉన్నవాళ్ళ ఊరికి జీప్ మాట్లాడి పెట్టా!

వారిని సాగనంపి యింటికి వచ్చేసరికి రాత్రి పది!

సరిగ్గా స్పాట్ వాల్యుయేషన్‌లో ఉండగా... ఉదయాన్నే పక్క ఇంటికి ఫోన్ వచ్చింది.

'ఫలానా లెక్చరర్ తండ్రి చనిపోయాడు! అక్కడకు తెస్తున్నారు! అందరికీ తెలియపరచండి''

స్పాట్ వాల్యుయేషన్‌కు వెళ్ళేవాడిని... ఆ రోజు ఉండిపోయి మరో లెక్చరర్‌తో కావాల్సిన అరేంజ్‌మెంట్స్ పూర్తిచేసి... వాళ్ళకు కావలసిన అల్పాహార సౌకర్యాలు సమకూర్చి... కారులో వచ్చిన ఆయన భౌతికకాయానికి 'మహాభినిష్క్రమణం' చేయించేసరికి రాత్రి ఏడుగంటలు!

'ఫలానా వారి తండ్రి హాస్పటల్‌లో హార్ట్ ఎటాక్‌తో పోయాడు గురూ... పోయి వద్దామా' అంటే నిస్సంకోచంగా బయలుదేరి... ఆ భౌతిక కాయం ప్రక్కన ఆటోలో కూర్చుని ఇంటికి చేరవేసేంత వరకూ ఒక పవిత్ర కర్తవ్యంగా భావించి... అయిన వాళ్ళకంటే ముందుగా అన్ని కార్యక్రమాలలో ముందున్న జ్ఞాపకం ఇంకా పచ్చిగానే ఉంది.

ఇంటి ప్రక్కనే మరో లెక్చరర్ తల్లి అంతిమ క్షణాలలో దగ్గరుండి తులసి నీళ్ళు పోయించడం ఆ తరువాత అంత్యక్రియలు అయ్యేంతవరకూ టీ కాఫీ వ్యవహారాలు చూడడం ఓ బాధ్యతగా అనుకోబట్టే... షుగర్ పేషెంట్లు సైతం కళ్ళు తిరిగి పడిపోకుండా కార్యక్రమం నిర్వహించగలిగారు.,

కానీ చివరకు నన్ను అంతగా అభిమానించిన... నేను ప్రేమించిన కన్నతండ్రికి తులసి నీళ్ళు పోయలేకపోయాను! ఎప్పుడూ దగ్గరగా ఉన్నా... దూరం అనిపించుకునే తమ్ముడే తులసి నీళ్ళు పోశాడు.

విధి కూడా చిత్రమైంది. బాగా ప్రేమ వున్నవారిని ఆఖరి క్షణాలలో దగ్గర ఉండనివ్వదు. నా భార్య సరిగ్గా నెలరోజుల క్రితం దేశం కాని దేశంలో ఉన్న కుమార్తె దగ్గరకు వెళ్ళింది... ఆరు నెలలు నిండిన మనవరాలితో సహా!

రాష్ట్రం కాని రాష్ట్రంలో ఉద్యోగం చేస్తున్న యిద్దరు కొడుకులూ దూరంగానే ఉండిపోయారు.

ఒక్కడినే... అలా ఒంటరిగా డాబాపై కూర్చొని... ఎవరైనా రాకపోతారా... అని ఎదురు చూచి... చూచి కళ్ళు కాచాయి. ఎవరో వస్తారని ... ఏదో చేస్తారని... ఎదురు చూచి... ఐదో రోజు వెళ్ళిపోయింది.

ఏడో రోజు నాడు ఎవరూ రారు... వచ్చి పలకరించరు.

అయినా... ఎవరో ఒకరు వచ్చి తమ్ముడిని రోజూ పరామర్శ చేస్తున్నారు. పలకరిస్తున్నారు. కుశల ప్రశ్నలు వేసి సానుభూతి చూపించి మరీ వెళ్తున్నారు. ముఖ పరిచయం ఉన్నవారు నన్నూ పలకరించి వెళ్తూనే ఉన్నారు.

కానీ... నా వాళ్ళేరీ? నా కాలేజీ వాళ్ళేరీ?

అందరికీ యివ్వమని కార్డులన్నీ ఆఫీసులో ఇచ్చి వచ్చానుగా!

మళ్ళీ వంటరితనం... వేదన... ఆవేదన... చీకటి మూసిన ఏకాంతం... తోడొకరుంటే!

క్షణకాలం జ్ఞాపకం వచ్చింది... యీ మధ్యనే విన్న పాట తాలూకు పల్లవి!

'జగమంత కుటుంబం నాది... ఏకాకి జీవితం నాది...'

మా తమ్ముడిని చూస్తుంటే ఓ విధంగా అసూయగా ఉంది.

వాడుంటున్నది... పుట్టి పెరిగిన ఊరిలో... వాడి అడ్రస్... బ్రహ్మంగారి అబ్బాయి! అందుకనే నాన్నకు తెలిసిన వాళ్ళంతా. గత ముప్ఫై రెండేళ్ళుగా ఆయన బాగోగులు తెలిసిన వారంతా వాడినే పలకరించడానికి వస్తున్నారు.

నాకు డాబానే శరణ్యమైంది. 'నిజమేనేమో... వాడన్నట్లుగా 'నా' అనుకున్న నా కాలేజీ వాళ్ళు ఎవరూ రారేమో... అయినా... ఏకాంతం కల్పించిన చీకటిలో చిరుదీపం వెలిగించుకోవాలనే తపన... నిరీక్షింప చేస్తూనే వుంది.. ఎవరైనా వస్తున్నారేమోనని'... తలుపు చప్పుడైతే... వాళ్ళేమోనని... అలికిడి వినిపిస్తే... చాలు... వాళ్ళెవరో వచ్చారని...'

ఎనిమిదవ రోజు వెళ్ళిపోయింది. తొమ్మిదవ రోజు ఉదయించింది.

ఆ ఉదయాన్నే సత్రానికి బయలుదేరి వెళ్ళాలి. స్వంత యిల్లు అయినా... అంతమందికి 'నాన్న' ప్రసాదం పెట్టాలంటే... కష్టం... బయలుదేరే సమయం ఆసన్నమైంది.

''బ్రహ్మంగారి యిల్లెక్కడండీ''

నలుగురు వ్యక్తులు... టాటా సుమోలో వచ్చిన వారు... యింటి ప్రక్కన వాళ్ళను అడగడం డాబా మీద నుండి కనిపించింది.

''హమ్మయ్య! నా కాలేజీ వాళ్ళు వచ్చారు'' ఒక్క నిట్టూర్పు విడిచాను

నలుగురు హుందాగా, ఇన్‌షర్ట్‌లతో, పూలతో, బూట్లతో టిప్‌టాప్‌గా ఉన్నారు.

వారి వెనుక మా రెండవ వాడు కారు దిగాడు.

'వెల్‌కమ్! దిస్ యీజ్ మై గ్రాండ్ పా హౌస్''

వాడు యింటి తలుపు తీసుకొని మెట్లు ఎక్కుతున్నాడు.

వాడు సాఫ్ట్‌వేర్ కంపెనీలో టీమ్ లీడర్‌గా చేరి మూడు నెలలే అయింది.

నాన్న పోయినప్పటినుండి యిద్దరు అబ్బాయిలూ ఫోన్లో మాట్లాడుతూనే ఉన్నారు. రాలేకపోతున్నామని చెబుతూనే ఉన్నారు.

ఇంతలో హఠాత్తుగా చిన్నవాడు రావడం చూచి ఆశ్చర్యపోయాను.

''నాన్నగారూ! వీళ్ళంతా మా కంపెనీలో పనిచేసేవాళ్ళే!'' అంటూ సహ ఉద్యోగులను ప్రాజెక్టు మేనేజర్‌గా, టీమ్ లీడర్లుగా పరిచయం చేశారు.

''యు ఆర్ బ్ర హ్మంగారి సన్... శ్రీకాంత్ పాదర్!'' వాళ్ళు నాకు నమస్కరించారు.

సంభాషణ అంతా ఇంగ్లీషులోనే జరుగుతోంది.

నాన్న పరమపదించినందుకు హృదయపూర్వకమైన సానుభూతిని ప్రదర్శించారు.

ఆయన పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.

''మీవాడు యిక్కడే కార్యక్రమం పూర్తయ్యేంత వరకు వుండే విధంగా లీవ్ గ్రాంటు చేశారు. ఆర్థికమైన ఇబ్బందులేమైనా ఉండవచ్చునేమోనని... అడ్వాన్స్‌గా యీ డబ్బు ఉంచవలసిందిగా ప్రార్థిస్తున్నాము''

మా వాడి ద్వారా పెద్ద మొత్తాన్ని నా చేత అందించారు.

కాసేపు కూర్చొని హృదయపూర్వక సానుభూతి'' ప్రకటించి సెలవు తీసుకుంటూ ''బ్రహ్మంగారి అబ్బాయిగారూ! శ్రీకాంత్ నాన్నగారూ! మీరు త్వరగా పితృదుఃఖం నుండి కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నాం'' అంటుంటే కనులు చెమ్మగిల్లాయి. వారి సానుభూతి వాక్యాలకు!

ఉద్యోగులతో మావాడి సహజీవనం మూడు నెలలు!

నా కళాశాల ఉద్యోగులతో నా అనుబంధం వయస్సు... ముప్ఫై మూడు సంవత్సరాలు!

★